# మనసు

ఎదురింటి జానకి పిట్టగోడలనిండా వెలిగించిన ప్రమిదలు వుంచుతూంది. తెల్లటి కంచి పట్టుచీరకి దోసెడు వెడల్పు ఎర్రజరీ బోర్డరు. చీర అంచుకి సరిపోయే జాకట్టు, తలంటి పోసుకుని వదులుగా వేసుకున్న బారెడు నల్లటి జడ, తెల్లని నుదుటిపై నల్లటిగీతలు గీసినట్టు జీరాడే ముంగురులు, జడలో కనకాంబరాలు. చేతులకి గలగలలాడే రంగు రంగుల గాజులు. కళ్ళల్లో దీపాల జ్యోతులు తళుక్కుమంటూంటే జానకి అందానికీ, ఆనందానికి ప్రతినిధిలా వుంది. ఆరోజు క్రితంరోజే ఆమె భర్త వచ్చాడు, మొదటి దీపావళికి అత్తవారింటికి.

వీధివైపు వరండాలో వాలుకుర్చీలో పడుకుని ఎదురింటివైపు నిర్లిప్తంగా చూస్తూంది. రాధ కట్టుకున్న తెల్లటి చీరలాగే ఆమె మనసూ శూన్యంగా వుంది. నిన్ననగా తల్లి బలవంతంగా వేసిన జడ రేకులా అణిగివుంది. కుంకుమలేని ఆమె నుదురు ఆమె జీవితంలాగే కళాహీనంగా కనిపిస్తూంది. ఆమె కళ్ళలోంచి జారుతున్న అశ్రువులు ఆమె చెంపలోనే ఇంకిపోతున్నాయి. మూర్తీభవించిన శోకాధిదేవతలా వుంది రాధ.

సరిగ్గా ఏడాదిక్రిందట రాధకూడా జానకిలాగే దీపాలు వెలిగిస్తూంది. ఈనాటి జానకి ఆనందానికి వెయ్యిరెట్లు ఎక్కువ ఆనందం ఆనాటి రాధది.

లోపల్నుంచి క్రిష్ణ కేకవేశాడు. "రాధా.... రాధా.... నా ప్యాంటు ఎక్కడ పెట్టావు కనపడడంలేదు వచ్చి యియ్యి !"

రాధ నవ్వుకుని వెళ్ళలేదు .... "ఆ కుర్చీమీద పెట్టాను తీసుకోండి" జవాబిచ్చింది.

"ఆ కుర్చీకూడా కనపడడంలేదు, నీవే రావాల్సిందే !" కొంటెగా పిల్చాడు.

"అబ్బబ్బ...." దొంగకోపం నటిస్తూ వచ్చిన రాధని తలుపు చాటునే చేతుల్లో బిగించాడు కృష్ణ. "ఒక్కసారి రమ్మని పిలుస్తుంటే అంత బిగుస్తావేం. నేనేకదా అందంగా వున్నానని గర్వం" నవ్వుతూ అన్నాడు.

"ప్రొద్దున్నుంచి నూరుసార్లయింది, ఒక్కసారంటూ పిలవడం" మూతి బిగించి అంది రాధ.

"యిది నూట ఒకటిసారి, లెక్కపెట్టుకో ! చిలిపిగా అన్నాడు కృష్ణ.

ఆనాటి వారి అన్యోన్యతకి, ఆనందానికి అవధులులేవు. చుట్టూ వున్న ప్రపంచాన్ని, మనుష్యులని, ఆఖరికి దేముడిని సయితం ధిక్కరించే టంతటి పారవశ్యం వారిసొత్తు ఆనాడు.

అందుకే కన్నుకుట్టింది దేముడికి. ఓర్వలేకపోయాడులావుంది.

ఆ ఆరునెలలు ఒక్కక్షణంలాగ కలలోమాదిరి గడిచిపోయింది రాధకి. ఆమె జీవితానికి ఆ సంవత్సరం శిఖరం లాంటిది.

శిఖరాగ్రానికి చేర్చి ఒక్కసారిగా అగాధంలోకి త్రోసేసింది విధి. ఆ గడిచిపోయినరోజుల మధురానుభూతే రాధకి మిగిలింది. ఆ మధుర క్షణాలజ్ఞప్తిలో కులుముతూ, పరవశిస్తూ జీవచ్ఛవంలా బ్రతకమని శాసించాడు రాధని విధాత.

ఆ రోజులు .... యింక కలలో చూసుకుని మురవాల్సిందే ! ప్రాణంలా పెంచిన తల్లిదండ్రులు, అపురూపంగా చూసుకునే అత్తగారు, ప్రాణాధికంగా ప్రేమించిన భర్త, ఐశ్వర్యం. హోదా, ఆనందం అన్నీ, వుండేవి ఆనాడు రాధకి.

సముద్రానికి దగ్గిరగా వాల్తేరు అప్‌లాండ్స్‌లో ఎర్రరాళ్ళ గుట్టల మధ్య చిన్న అధునాతనమైన బంగళా, ముందు అందమైన పూదోట లోపల అందం, ఆధునికత జతపడిన ఫర్నిచర్. కాలుక్రింద పెట్టనీయని

అత్తగారు, అడుగులకి మడుగులొత్తే చాకర్లు, నౌకర్లు .... దేనికి లోటు వుండేదికాదు.

బుల్లి హెరాల్డుకారులో వీకెండ్సుకి భీమ్లి, ముడసర్లోవ, సింహాచలం, ఎక్కడికో అక్కడికి పిక్నిక్కులు ! ఎన్నెన్ని వెన్నెల రాత్రుళ్ళు నిర్మానుష్యమైన బీచి ఒడ్డున రాధ వడిలో తలపెట్టుకుని క్రిష్ణ పడుకుని ఎన్నెన్ని బంగారుకలలు కనేవారు భవిష్యత్తుని గురించి భవిష్యత్తుకి ఎంత చక్కని బాటలు వేసుకునేవారు.

స్వర్గం అంటే వేరే ఎక్కడుంటుంది అనిపించే రోజులు అవి ! సుఖం వెనక కష్టం వుంటుందన్న సామెత అక్షరాల నిజమయింది రాధకి. కళ్ళు మిరుమిట్లు గొలిపేకాంతి వెంటనే చీకటి తప్పదు. రాధ బ్రతుకులో చీకటి అలాగే అలుముకుంది.

ఆ రోజు....

కృష్ణ రోజుకంటె తొందరగా, హడావిడిగా వచ్చాడు ఆఫీసునించి. "రాధా... రాధా.... అమ్మా !" ఉత్సాహంగా కేకలు పెట్టాడు

రాధ, వంటింటిలోంచి సీతమ్మ ఒక్కసారే వచ్చారు ఏమిటోనని గాబరాగా, "రాధా.... ఒక గుడ్‌న్యూస్ ! .... చెప్పుకో చూద్దాం ! ".... ఉత్సాహంగా అన్నాడు.

"ఏమిటది ?.... ప్రమోషనా !".... ఆలోచన అభినయించింది రాధ.

"ఉహు.... కాదు...." ఊరించాడు.

"చెప్పకూడదురా ఏమిటో అది...." సీతమ్మగారుకూడా ఆదుర్దాగా అడిగారు.

'అదేరాధా.... నేనెన్నాళ్ళనించో కలలు కంటున్నాను. ఫారెన్ ఛాన్సుకోసం ! అదృష్టవశాత్తు నాకు వచ్చిందా ఛాన్సు యిప్పుడు. స్టేట్సుకి పంపిస్తూంది కంపెనీ నన్ను ఏడాది ట్రైనింగ్‌కి. పదిహేను రోజులలోనే వెళ్ళాలి ! నాకంటే ఎంతోమంది సీనియర్స్‌వున్నా అదృష్టంకొద్దీ ఛాన్సు నాకు వచ్చింది." ఉత్సాహంగా చెప్పసాగాడు కృష్ణ.

రాధ మొహం నల్లబడింది. సీతమ్మగారు కలవరపడుతూ చూచారు.

"అదేమిటి ఇంత మంచి వార్త చెపితే అలా పెట్టారేమిటి మొహాలు."

"యిప్పుడెందుకు నాయనా.... అంతదూరం వెళ్ళకపోతేనేం.... ఆ విమానాలు అవి ఎక్కి అంత దూరదేశం ఎందుకు వెళ్ళటం!" సీతమ్మ గారు అయిష్టంగా అంది.

"ఏమిటమ్మా.... నీ ఛాదస్తం.... రోజుకి వేలమంది విదేశాలు వెళుతున్నారు విమానాలలో.... యింత మంచిఛాన్సు మళ్ళీ మళ్ళీ కావాలంటే వస్తుందా.... అదృష్టంకొద్దీ వచ్చింది.... నా ఉత్సాహం అంతా ఎగరగొట్టేస్తున్నారు మీ యిద్దరూ" బిగ్గరగా అన్నాడు కృష్ణ.

"నాదేముంది నాయనా, మీ యిద్దరూ ఆలోచించుకోండి.... మీ యిద్దరికీ యింత క్రొత్తలోనే యీ ఎడబాటు ఎందుకని అన్నాను." నెమ్మదిగా లోపలికి వెళ్ళింది ఆవిడ.

రాధ మౌనంగా లోపలికి నడిచింది. వెంటవెళ్ళి గదిలో రాధని తనవైపు తిప్పుకున్నాడు కృష్ణ, 'అదేమిటి రాధీ.... అలా వున్నావు.... నేను వెళ్ళటం నీకిష్టం....' రాధ కృష్ణ గుండెల్లో మొహం దాచుకుంది .... "యిప్పుడు మీరు వెళ్ళకపోతేనేం.... ఒక్క సంవత్సరం ఎలా వుంటాను మిమ్మల్ని వదిలి...." అస్పష్టంగా గొణిగింది

"ఛీ ? .... నాకు మాత్రం నిన్నొదిలి వెళ్ళాలంటే యిష్టమా ! నిన్నొదిలి వెళ్ళాలంటే నాకెంత బాధో నీకు మాత్రం తెలియదా ? .... కాని .... లైఫ్‌లో మళ్ళీ యిలాంటి ఛాన్సు వస్తుందా ? .... ఒక్క సంవత్సరం అంటే ఎంత .... నిమిషంలో గడిచిపోదా !" రాధ మొహం పైకెత్తి ముంగురులు సవరిస్తూ ప్రేమగా అన్నాడు కృష్ణ.

కన్నీళ్ళు కృష్ణకి కనపడకుండా దాచాలని ప్రయత్నించింది రాధ.... 'ఎలా వుంటాను.... ఏడాది.... మీరు లేకుండా !"....

"విరహగీతాలు పాడుతుండు...." కొంటెగా నవ్వాడు కృష్ణ.

రాధకి తెలుసు కృష్ణ ఫారెన్‌ఛాన్సుకోసం ఎన్నాళ్ళబట్టో ప్రయత్నిస్తున్న సంగతి. విదేశాలు వెళ్ళాలన్న అతని బలమైన కోరిక తన స్వార్థానికి బలిచెయ్యమని గట్టిగా కోరలేకపోయింది. ఆఖరి ప్రయత్నంగా అడిగింది.

"పోనీ! నన్నూ తీసికెళ్ళండి మీతో !" ఆశగా అడిగింది.

"నిన్నా .... ఈ స్థితిలోనా ! .... అక్కడికి తీసికెళ్ళి పుట్టబోయే అబ్బాయికి జోలపాటలు పాడుకుంటూ కూర్చోనా, పనిచెయ్యనా ! .... అయినా నీకెందుకు దేశంగాని దేశంలో అవస్థలు ! హాయిగా అమ్మానాన్నల దగ్గరవుండి, నేనొచ్చేనాటికి పాపనో, బాబునో ఇవ్వాలి !" .... రాధ కళ్ళల్లోకి ప్రేమగా చూస్తూ అన్నాడు కృష్ణ.

యింకేమనలేక పోయింది రాధ.

ప్రయత్నాలు ఆరంభం అయ్యాయి. సామాను, రాధ పుట్టింటికి చేరారు.

వెళ్ళేరోజు రాత్రి కృష్ణ, రాధ అసలు నిద్రేపోలేదు.

కృష్ణకి సెండాఫ్ యీయడానికి రాధ, రాధ తండ్రి యిద్దరూ కలకత్తా వెళ్ళారు.

అంతవరకు ఉత్సాహంగావున్న కృష్ణకికూడ వెళ్ళేముందు కన్నీళ్ళు తిరిగాయి. ఎర్రబడ్డ కళ్ళతో నిల్చున్న రాధ బుజాలు మెత్తగా నొక్కి వెనక్కి చూస్తూ చూస్తూ ప్లేనెక్కాడు.

ఆకాశంలోకి లేచిన విమానంతో పాటు రాధ వూహలూ గాలిలో తేలిపోయాయి.

సరిగ్గా సంవత్సరం ! మళ్ళీ ఇదేనాటికి యిలాగే కృష్ణకోసం ఎదురుచూస్తూ నిల్చుంటుంది చేతిలో పూలమాలలతో, బాబుని యెత్తుకుని. కృష్ణ వస్తాడు మెరుస్తున్న కళ్ళతో తనవైపు చూసి ఆప్యాయంగా బుజం చుట్టూ చేయి వేస్తాడు. బొద్దుగా, తెల్లగావున్న బాబుని గాలిలోకి ఎగరేసి ముద్దులు పెట్టుకుంటాడు.

ఓహ్ !.... తరువాత.... భవిష్యత్తంతా ఆనందమే ! ఇంకా పెద్ద వుద్యోగం, ఇంకా పెద్దహోదా!... కారులో ఇద్దరిమధ్యా బాబుతోషికార్లు !

గాలిలో తేలిపోయే ఊహలని అరికట్టి.... హోటలుగది చేరింది. వూరు చూడడానికి యేవేవో కొనడానికి రెండురోజులు ఆగాలనుకున్నారు సీతారామయ్య, రాధ.

ఇంకా యింటికి రాకముందే.... మర్నాడు హోటలు రూములోనే తెలిసింది ఘోర వార్త.

అదివిన్న రాధ రెండురోజుల వరకు బాహ్యస్మృతి కోల్పోయింది. తెలివితప్పి వున్న రాధని యింటికి చేర్చాడు సీతారామయ్యగారు. ఆ మర్నాడు వివరంగా ఆ విమాన ప్రమాదం గురించి పత్రికలు పకటించాయి. "విమానం బయలుదేరిన ఇరవై నిమిషాలకే కంట్రోలు తప్పింది. మరిరెండు నిమిషాలకే మంటలకి ఆహుతి అయింది విమానం. ప్రయాణీకులు, సిబ్బంది ఎవరు బ్రతికి బైట పడలేదని నమ్ముతున్నారు. విమానం కూలిన చోటకి అధికారులు వెళ్ళి పరిశీలించారు. అంతా మొత్తం భస్మీపటలమైపోయింది. ప్రమాదం ఎందుకు జరిగిందో విచారించడానికి ఓ కమిటీ ఏర్పాటయింది. యింత ఘోర ప్రమాదం గత పది ఏళ్ళలోనూ జరగలేదని వార్త. మరణించిన వారి కుటుంబాలకి ప్రభుత్వం సానుభూతి తెలియ పరుస్తూంది...."—

ఆ వార్త చదివి కుళ్ళి కుళ్ళి ఏడ్చింది రాధ. సీతారామయ్యగారు, భార్య ఒక్కగా నొక్క కూతురికి పట్టిన దుర్గతికి గుండెలవిసేలా విలపించారు. కృష్ణ తల్లి పూజామందిరంలో కూర్చుని పూజ చేసుకుంటూ ఆ వార్త విని గోడకి చేరబడిపోయి, మరి లేపలేము ఆవిడ !

సర్వం దోపిడి అయిన బికారిలా మిగిలిపోయింది రాధ....జీవచ్ఛంలా ఎందుకు బ్రతకాలో కూడా తెలియకుండా,....దేనితో సంబంధం నట్లు నిర్లిప్తంగా ఎటో శూన్యంలోకి చూస్తూ కూర్చుండిపోయేది రాధ !

తన బ్రతుకుకి అర్థం ఏమిటో బాబు పుట్టేవరకు రాధకి తెలియలేదు

బాబు పుట్టాక కృష్ణ జ్ఞాపకానికి చిహ్నంగా మిగిలిన బాబుకోసమన్నా బ్రతకక తప్పదని తేలింది రాధకి !....

ఎదురింటి జానకి .... ప్రక్కన ఆమె భర్త ఏదో చెబుతూంటే సిగ్గు దొంతర్ల మధ్య ముసిముసి నవ్వులు నవ్వుతూంది.

సరిగ్గా సంవత్సరం అయింది అప్పుడే! .... ఆ దీపావళికి ఈ దీపావళికి ఎంత తేడా !

ఇల్లంతా దీపాలతో, మామిడి తోరణాలతో, ముగ్గులతో, గడపలకి పసుపు కుంకుమలతో, కొత్తబట్టల రెపరెపలతో, కొత్త అల్లుడు రాకతో కళకళలాడిపోయింది ఆ రోజు....

కృష్ణ చంటి పిల్లాడికంటె ఉత్సాహంగా తండ్రి తెచ్చిన మూడు బుట్టల బాణసంచా కాల్చాడు....కాకర పూవత్తులు పట్టుకుని రాధ మీద మీదకీ తెచ్చి భయపెట్టాడు.

"మతిలేకపోతే సరి .... చంటిపిల్లాడిలా ఏమిటా గెంతడం !" రాధ దొంగకోపంతో కసిరింది.

"చంటివాడిని కానా ఏమిటి ! మీ యింట్లో నీవు చంటిపాపవి. మా ఇంట్లో నేను చంటిబాబుని. అమ్మ నడుగు కావలిస్తే....నేను ఆఫీసు నించి అరగంట ఆలస్యంగా వస్తే అమ్మ యెలా గాబరాపడిపోతుందో తెలుసా !" కొంటెగా అన్నాడు కృష్ణ.

కూతురు, అల్లుడు .... ముచ్చటని తనివితీరా చూస్తున్న సీతారామయ్య అన్నారు "అవునమ్మా .... మీ రెంత పెద్దవాళ్ళయినా మాకు చంటిపిల్లలే ! .... ఈ యింట్లో మళ్ళీ చంటిపాపలు వెలిసేవరకు మీరే పసిపిల్లలు" అన్నారు.

చూశావా అన్నట్టు చిలిపిగా నవ్వాడు కృష్ణ.

ఏది ఆ రోజు ! ఏమయిపోయింది ఆ ఆనందం ! మరి ఈ జన్మకి ఇంక ఆ రోజు తిరిగిరాదా ?....

ఈనాడు సోకాంధ తిమిరావళి తమకు. ప్రతి యిల్లు దీపాలతో వెలిగి

పోతూంది! తమ ఇంట మాత్రం చీకటి రాజ్యం చేస్తూంది! ఈ ఇంట్లో వెలుగే అస్తమించింది!....

భరించలేని దుఃఖంతో వెక్కి వెక్కి ఏడ్చింది రాధ గతం గుర్తు తెచ్చుకుని .... పగిలిన ముక్కలని దగ్గిరిగా చేర్చడానికి ప్రయత్నిస్తున్నట్టు శోకాతిశయంతో పగిలే తలని రెండు చేతులతో అదిమిపట్టింది. కుర్చీలో వెనక్కు వ్రాలి అలా కళ్ళుమూసుకుని వుండిపోయింది. అలా ఎంతసేపుందో!.... క్రిందనించి తండ్రి కేకలకి త్రుళ్ళిపడి లేచింది రాధ.

"రాధా....రాధా .... అమ్మా తల్లీ .... త్వరగా రావమ్మా!...." గాబరాగా కేకలు పెడుతున్నాడు సీతారామయ్యగారు "చూడమ్మా.... రావమ్మా...."

కారణం తెలియక సంభ్రమాశ్చర్యాలతో, వడివడిగా క్రిందికి దిగింది రాధ. సావిట్లో ఎదురుగా కనబడిన దృశ్యం చూసి స్థాణువై నిలబడిపోయింది. నోట మాట రానంతగా మొద్దుబారింది ఆమె మనసు! కలయో, నిజమోనన్నది తెలియనంత ఆశ్చర్యంలో మునిగిపోయింది.

"నేను రాధా....అలా చూస్తున్నావేమిటి....నమ్మలేకపోతున్నావా?" కృష్ణ ముందుకు వస్తూ అన్నాడు.

మరు నిమిషంలో రాధ కృష్ణ గుండెలమీద వ్రాలిపోయి గుండెలు బ్రద్దలయ్యేలాగ ఏడవసాగింది...."ఊరుకో రాధా....ఊరుకో .... మళ్ళీ నిన్ను చూడగలుగుతానని ఎన్నడూ అనుకోలేదు...." కృష్ణ కంఠం గూడా పూడింది.

నమ్మలేని విషయంగా, అద్భుత విషయం చూస్తున్నట్టు మ్రాన్పడిపోయారు సీతారామయ్య, భార్య!

తరువాత రెండు గంటలకు వడిలో తలవంచుకుని పడుకున్న రాధ ముంగురులు సవరిస్తూ తన గురించి అంతా చెప్పాడు కృష్ణ!...."ఆ రోజు నిన్నువిడిచి వెళ్ళలేక వెళ్ళలేక ప్లేనెక్కాను. విమానం పైకి లేచిపోతూంటే దూరమయ్యే నిన్ను గురించి పది నిమిషాలు బాధపడ్డాను. తరువాత క్రింద కనిపించే ప్రకృతిని మైమరచి చూస్తూ ఓ పదినిమిషాలు

కూర్చున్నానో లేదో, ఏదో కలవరం బయలుదేరింది. ప్లేనులో పైలటు కూడ అందరు గాభరాలో వున్నారు. ఓ ఐదు నిమిషాలు గడిచేసరికి ఒక పైలట్ చావుకబురు చల్లగా చెప్పాడు.... ప్లేను కంట్రోలు తప్పిపోయిందని వీలు చూసుకుని లాండ్ చేయడానికి ప్రయత్నిస్తున్నామని .... యింక అప్పుడు చూడాలి అక్కడ వాతావరణం! అందరూ భయంతో వెల వెల బోయారు. ఏం చెయ్యాలో తోచక గాభరాగాలేచి కొందరు ఇటూ అటూ పరిగెత్తారు. ఆడవాళ్ళు ఏడుపు ఆరంభించారు. ప్లేను అప్పటికే ఇటూ అటూ ఇష్టంవచ్చినట్టు కం[illegible]స్తూంది.... అందరికి దడ పట్టుకుంది! ఎవరికీ ఏం చెయ్యాలో అర్థంకాదు.....పైలట్ నేదో ఏ భగవంతుడన్నట్టు అందరూ రక్షించమని వేడుకోడం మొదలెట్టారు. క్రూ అందరిని శాంతపరుస్తూ తమ చాతనైంది చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఇంక నా కయితే మతేపోయింది. భగవంతుడా, అందరూ వద్దంటున్నా ఇలా బలవంతంగా చావడానికా వచ్చాను, అనుకుంటే భయంతో చెమటలు పట్టాయి .... ఆ క్షణంలో రాధా....నీవే గుర్తుకు వచ్చావు....నా కేమన్నా అయితే నీవే మయిపోతావు అని మనసు మూలిగింది బాధగా. అప్పటికి విమానం పూర్తిగా కంట్రోలు త[illegible]ంది ... లాండ్ చేయడానికి అంతా కొండలు, ఇళ్ళు....విమానం తుఫానులో చిగురుటాకులా అల్లాడుతూంది. అందరం ఆశ వదిలేసుకున్నాం....అందరూ ఏక కంఠంతో దేముడిని ప్రార్థించారు ....అంతే!....ఆ క్షణంలో పెద్ద చప్పుడయింది. తరువాత ఏమయిందో నాకు తెలియదు.

మళ్ళ తెలివి వచ్చేసరికి ఒక ఇంట్లో మంచంమీద వంటినిండా కట్లతో వున్నాను. చుట్టూ ఎవరో తెలియని మనుషులు! నే నెవరో, నా కేమయిందో, ఎలా దెబ్బలు తగిలాయో, అక్క డెందుకున్నానో ఏది గుర్తులేదు. నాకు చిత్రం నా పేరేమిటో కూడా, ఎక్కడినించి వస్తు న్నానో కూడా వాళ్ళకి చెప్పలేకపోయాను. తరువాత వాళ్ళు చెప్పిం దాన్నిబట్టి విమానం కూలిపోయిన వెంటనే నేను క్రింద పడ్డానన్నమాట. అదృష్టవశాత్తు వాళ్ళ ఇంట్లో గడ్డిమేటుమీద పడ్డాను కనక కొద్దిపాటి

దెబ్బలతో ప్రాణం దక్కింది. ఆ షాకుకి మతి చలించింది. పూర్వ జ్ఞాపకం పోయిందన్నమాట !

ఆ యింటి వాళ్ళు ముస్లింలు ! ఈ సంవత్సరం నన్ను కన్నకొడుకు కంటె ఎక్కువగా ఆదరించారు ! ఏం చేసినా వాళ్ళ ఋణం తీర్చుకో లేను. నే నెవరో తెలియక, ఎక్కడివాడనో నా సమాచారం ఏకీ తెలియక వాళ్ళ యింట్లోనే పిల్లలులేని వాళ్ళు నన్ను మతం మార్చి పెంచుకున్నా రుట ! ఆ యింటివాళ్ళ అభిమానం ఎంతదూరం వెళ్ళిందంటే వాళ్ళ యింట్లో తల్లిదండ్రులు లేని మేనకోడలు ఫతిమాతో నా పెళ్ళి చేయ డానికి నిశ్చయించారుట.

ఫతిమా చాలా అందంగావుంటుంది, తెల్లగా, వత్తయిన కనుబొమలు, బారెడు నల్లటి జడ చాలా అందంగా నన్ను ఆకర్షించింది. ఇద్దరం చాలా చనువుగా వుండేవారంట. పెళ్ళికి ఇంకో వారం వుందనగా రోజూ అలవాటు ప్రకారం ఫతిమా నేనూ ఇద్దరం ఊరిబయట కొండల మీదికి షికారు వెళ్ళాం. ఆ రోజు ఏదో అని నన్ను కవ్విస్తూ, ఊరిస్తూ నా కంద కుండా ఫతిమా పరుగెత్తడం ఆరంభిస్తే వెంట తరుముతూ నేను పరిగెత్తా నుట ! ఒక పెద్ద బండరాయిమీద బూజుజారి రాళ్ళమీంచి దొర్లుకుంటూ క్రిందపడ్డాను. తెలివి తప్పిపోయింది. ఇంటికి చేర్చారు.

తెలివి వచ్చింది. కాని వాళ్ళెవరిని గుర్తుపట్టలేకపోయాను. సంవత్సరంనించి అక్కడ వున్నట్టే గుర్తులేదు నాకు. అంటే విమానం లోంచి పడ్డాక పోయిన జ్ఞాపకం మళ్ళీ యీ షాక్‌కి తిరిగి వచ్చిందన్న మాట ! అప్పుడే ప్లేనులోంచి పడ్డట్టు మెళుకువ వచ్చింది. "నేను బ్రతికి నాను ! విమానం ఏమయిందీ ? వీరెవరు ?" అంటూ ప్రశ్నించాను.

"సరే. యింకేముంది మతితప్పినన్నాళ్ళు అక్కడ వుండగలిగాను కాని, వెంటనే యింక అక్కడ వక్కక్షణం వుండలేకపోయాను. ఈ సంవత్సరంనించి నీవు పడే బాధ ఊహిస్తే మరుక్షణం రెక్కలు కట్టుకు వ్రాలాలనిపించింది. కాని వంటిమీద స్వల్పగాయాలు మానేవరకు వాళ్ళు కదలనీయలేదు. నిజంగా నేను వచ్చేరోజున వాళ్ళ బాధ చూస్తే జాలని

పించింది. ముఖ్యంగా ఫతిమా! "నేనే అవివాహితుడినయితే ఫతిమాని వివాహం చేసుకునేవాడిని. యింకేముంది. యిదిగో నీ వడిలో వ్రాలాను. కథ సుఖాంతం" నవ్వుతూ ముగించాడు కృష్ణ.

"ముందు రాస్తే ఏం పోయిందేమిటి! .... యింత హఠాత్తుగా నన్ను ఆశ్చర్యంలో ముంచకుండా వస్తున్నట్టు రాయకూడదా!" నెపం వేసింది రాధ.

"ఒక్కసారిగా నిన్ను సంతోష పెట్టాలని...."

"నిజంగా .... యీ సంవత్సరం నరకయాతన పడ్డాను. జీవచ్ఛవంలా బాబుకోసం బ్రతికాను .... లేకపోతే—" రాధ కంఠం జీర పోయింది.

"అలా అనకు రాధా .... నీవు లేకపోతే నేనేం కావాలి." రాధ తల గుండెల నదుముకుంటూ ఆప్యాయంగా అన్నాడు కృష్ణ.

క్రిందినించి సీతారామయ్యగారు పిల్చారు — "అమ్మా రాధా .... క్రిందికి రండమ్మా .... అమ్మ యిల్లంతా దీపాలు పెట్టింది, రంగడు బాణ సంచా తెచ్చాడు.... దిగి రండమ్మా!" ఉత్సాహంగా పిల్చారు.

ఈ ఏడాదికి సరిపడ్డ అలంకరణ చేసుకుని, కరువుదీరా నుదుటి నిండా కుంకుమ దిద్దుకుని, ఏనాడో పెట్టె అడుగున పడేసిన వస్తువులన్ని అలంకరించుకుని మహాలక్ష్మిలా వున్న కూతురిని, ప్రక్కనే వస్తున్న అల్లుడిని చూసి — మరింక యీ జన్మకి చూడలేమనుకున్న దృశ్యం కళ్ళబడగానే సీతారామయ్య దంపతుల కళ్ళు చెమర్చాయి.

కృష్ణ చిచ్చుబుడ్డి అంటించి గిరగిర త్రిప్పాడు. రాధ బాబుని ఎత్తుకుని నిల్చుంది. "అమ్మకి అగ్గిపుల్ల గీస్తే దడ! అమ్మ దగ్గిర కూర్చుని నీవేం కాలుస్తావుగాని .... దగ్గరకు రా బాబూ—" అంటూ వెలుగుతున్న చిచ్చుబుడ్డితో దగ్గరకి వచ్చాడు ఒక్కసారిగా — ఉయ్యాలలో

బాబు కెవ్వుమన్నాడు. రాధ ఉలిక్కిపడి అయోమయంగా జరిగింది ఏమిటో క్షణంలో అర్థం అయింది. ఉయ్యాల దగ్గిరికి పరిగెత్తింది! ఉయ్యాలకేసి తల కొట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చింది రాధ—

ఏళ్ళక్రితం అతిగా చూసిన సినిమా కథల జ్ఞాపకాలు, ఆమె అంతరాంతరాలలో మెదిలే ఆశలు కలసి చేసిన కొన్ని క్షణాల గారడీలోంచి.... ఈ నిజ లోకంలోకి రావడం రాధకెంత నరకం!